ముసురు .. ఆపై జ్వరాలు

- వర్షంతో పౌర జీవనానికి అంతరాయం
- రాయవరం మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు


వర్షంలోనే పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులు

రాయవరం: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. ఈ వర్షాలకు గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. జనజీవనం స్తంభించింది. చాలా వరకూ ప్రజలు ఇంటి పట్టునే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజంతా చినుకులు పడుతూనే ఉండడంతో జనం కాలు బయట పెట్టలేక పోయారు. శుక్రవారం ఉదయం నుంచి భారీగా కురిసిన వర్షానికి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సిన వారు గొడుగులు, రెయిన్ కోట్లు ధరించి రోడ్డెక్కారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ సెలవు దినంగా ప్రకటించింది. దీంతో పలువురు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఆగిపోగా, అప్పటికే బయలుదేరిన వారు తిరిగి ఇంటి ముఖం పట్టారు. విడవకుండా కురుస్తున్న వర్షానికి చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా వ్యాపారాలు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షపు నీటితో డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షానికి ఇటుక బట్టీలు మూత పడ్డాయి. పలు బట్టీల్లో పచ్చి ఇటుకను కాపాడుకునేందుకు యజమానులు, సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు. వర్షాలకు ప్రస్తుతం వరి పంటకు ఎటువంటి నష్టం లేదని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. అయితే ఎక్కడైనా నీరు అధికంగా ఉంటే తొలగించుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మరో వైపు వైరల్ జ్వరాలు

గత పక్షం రోజులుగా పల్లెలు మంచం పట్టాయి. వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా పదుల సంఖ్యలో జ్వర పీడితులున్నారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడుతున్న వారిలో అత్యధికులు టైఫాయిడ్ బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. రోజూ పీహెచ్‌సీలకు వచ్చే వారిలో కనీసం 10 నుంచి 15 మంది వరకూ జ్వరాలతో బాధపడుతున్నట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలుస్తుంది. ఇదిలా ఉంటే అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జ్వరాలు మరింత పెరిగే అవకాశముంది. పల్లపు ప్రాంతాల్లో నిలచిన నీటితో దోమలు మరింతగా విజృంభించే అవకాశముంది. ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న పారిశుధ్యం మరింతగా క్షీణించే ముప్పు ఉంది.

రామచంద్రపురం డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటలకు వర్షపాతం వివరాలిలా..

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
మండపేట	33.6
రాయవరం	65.6
కపిలేశ్వరపురం	39.2
కె.గంగవరం	45.2
రామచంద్రపురం	42.6

అప్రమత్తంగా ఉంటున్నాం



గ్రామాల్లో వైరల్ జ్వరాలు కొద్దిగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇలాంటి తరుణంలో భారీ వర్షాలు కురవడం వల్ల తిరిగి జ్వరాలు పుంజుకునే అవకాశముంది. జ్వరపీడితులను గుర్తించేందుకు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపడుతున్నాం. సిబ్బందిని అప్రమత్తం చేసి, తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ రమ్యశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. పంచాయతీ కార్యదర్శులను శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాం. రోజువారీ పారిశుధ్యంతో పాటుగా, ఎక్కడా మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నాం. వర్షం తగ్గగానే బ్లీచింగ్ చల్లించి, హానికర సూక్ష్మక్రిముల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాసరావు, పంచాయతీ విస్తరణాధికారి, రాయవరం

ఎన్నికల హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఆక్రమణలపై చర్చ
- మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఎన్నికల వేళ కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన శనివారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు. అజెండాలోని పలు అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రధానంగా ఆక్రమణలు, రోడ్లు, మున్సిపల్ షాపుల అద్దె తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోటల హాజరు కావడంతో వాదోపవాదాలు గట్టిగా జరుగుతాయని అందరూ భావించారు. అందుకు భిన్నంగా సామరస్య పూర్వక వాతావరణంలో వారిద్దరూ కౌన్సిల్ సమావేశాన్ని నడిపించారు. ఒక దశలో ఇరువురి మధ్య నవ్వులు విరబూశాయి.

ఏవీ ఆ రూ.15 వేలు?

ఎన్నికల ముందు నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ టీడీపీ నాయకులు చేసిన వాగ్దానాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయని సమావేశంలో తోట త్రిమూర్తులు గుర్తు చేశారు. ఏవీ ఆ 15 వేలు అంటూ ఆయన ప్రశ్నించారు. టిడ్కో రుణాలను రద్దు చేస్తామన్న హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లకే పింఛను ఇస్తామన్న కూటమి నాయకుల హామీ అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారంటూ తోట తనదైన శైలిలో ఛలోక్తి విసిరారు. వలంటీర్లను కొనసాగిస్తామన్న పెద్దలు వారిని ఎప్పుడు తిరిగి విధుల్లోకి తీసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల స్పందించారు. ' పెద్దల సభలో మీరున్నారు కదా' అని గుర్తు చేశారు. 'అక్కడ ఈ విషయాలన్నీ లేవనెత్తితే సీఎం చంద్రబాబునాయుడు మీకు సమాధానం చెబుతా' రని వేగుళ్ల బదులిచ్చారు.

తాగునీటి శుభ్రతను తనిఖీ చేస్తున్నారా?

పట్టణంలో వైరల్ జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉందని, తాగునీటి శుభ్రత తనిఖీ చేస్తున్నారా? అని కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని ప్రశ్నించారు. మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై గుంతలుగా మారిందని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ సమావేశం దృష్టిలో పెట్టారు. రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి స్పందించి రోడ్ల మరమ్మతులకు ఆమోదం తెలిపారు. మూడు నెలల పాటు షాపుల బకాయిలు ఉన్నవారి జాబితా వచ్చే కౌన్సిల్ దృష్టికి తేవాలని ఎమ్మెల్యే సూచించారు. బకాయిలు చెల్లించాల్సిన 11 షాపులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని ఆర్వో జేవీఎస్ శాస్త్రి తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో కమిషనర్ బి.రాము, డీఈ కె. శ్రీనివాస్, ఏఈలు సత్యనారాయణ, పవన్‌కుమార్‌, ఆర్‌ఐ వంక ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, అధికార, ప్రతిపక్ష సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలేవీ?

మెయిన్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న మున్సిపల్ షాపులు నిర్వాహకులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ యరమాటి గంగరాజు కోరారు. ఈ క్రమంలో కొంతసేపు ఆక్రమణలపై చర్చ సాగింది. కేపీ రోడ్డు, మెయిన్ రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోయాయని, ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తున్నాయని పలువురు సభ్యులు ప్రస్తావించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ తాను గతంలో ఆక్రమణల తొలగింపునకు ప్రతిపాదనలు చేశానని గుర్తు చేశారు. ఇక్కడున్న అందరు నాయకులూ తనతో సహా డ్రైనేజీ వరకూ ఆక్రమణల తొలగించాక పట్టణంలోని ఆక్రమణలపై దృష్టి పెడదామన్నారు. నాయకులు జోక్యం లేకుండా ఉంటే అధికారులు ఈ పనిని క్షణాల్లో పూర్తి చేయగలరన్నారు. దానిపై కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ లేచి అందుకు తాను సిద్ధమే అన్నారు. చుండ్రు సుబ్బారావు చౌదరి మాట్లాడుతూ దాసిరెడ్డి వారి వీధిలో నివాస ప్రాంతాల మధ్య షాపులు పెట్టి వ్యాపారాలు చేస్తుంటే, అధికారులు వారి నుంచి మామూళ్లు దండుకుని మిన్నకుండి పోయారని ఎద్దేవా చేశారు. వల్లూరి వారి వీధి, సంకా వారి వీధి, నాళం వారి వీధుల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మురుగు పారుదలను దృష్టిలో ఉంచుకుని డ్రెయిన్ల ఆక్రమణలు తొలగిస్తే బాగుంటుందన్నారు. దీనిపై అధికారులు ఒక నివేదిక సిద్ధం చేయాలని తోట సూచించారు.

వరదల్లో ఉద్యోగుల విశేష సేవలు


కేదారిలంక కార్యదర్శి నరసింహారావును సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు

కపిలేశ్వరపురం: ప్రకృతి విపత్తుల సమయాల్లో ప్రభుత్వోద్యోగులు ప్రజలకు విశేష సేవలు అందించడం ప్రశంసనీయమని కేదారిలంక పంచాయతీ కార్యదర్శి సీహెచ్ నరసింహారావు సత్కార కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. కార్యదర్శిగా సుమారు పదేళ్ళపాటు పనిచేసి గ్రేడ్- 2 కార్యదర్శి హోదాలో పదోన్నతిపై కొత్తపేట మండలానికి బదిలీ వెళ్తున్న సందర్భంగా నరసింహారావును కేదారిలంక సచివాలయంలో శనివారం ప్రజలు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్తిబాబు, మాట్లాడుతూ గోదావరి నడుమ ఉన్న కేదారిలంక, శివారు గ్రామం వీధివారిలంక గ్రామాల్లో వరదలు సంభవించినపుడు కార్యదర్శి ప్రణాళికాబద్ధంగా సేవలందించడాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, వెన్నేటి సుబ్బారావు, పోలిశెట్టి బ్రహ్మయ్య, మద్దింశెట్టి దొరబాబు, సాదా రవి భాస్కరరావు, ధనరాజు, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగుల సాయంతో పెన్షన్ల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 పంచాయతీల్లో ప్రభుత్వోద్యోగుల సాయంతో శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు పెన్షన్ పంపిణీకి దిగారు. వారితో పాటు ఇతర ప్రభుత్వోద్యోగుల సాయంతో మండలంలో సాయంత్రం ఆరు గంటలకు 93 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 10,116 మందికి వివిధ సామాజిక పింఛన్లు మంజూరు కాగా 9,366 మందికి పింఛన్లు అందజేశారు. కపిలేశ్వరపురంలో 1,085 మందికి గానూ 1,010 మందికి పింఛన్లు అందజేశారు. అంగరలో 1,392 కి 1,302, కోరుమిల్లిలో 854 మందికి 780, టేకిలో 1000 మందికి 915, వాకతిప్పలో 427మందికి 373, మాచరలో 601మందికి 553, నేలటూరులో 655 మందికి 610, వల్లూరులో 590 మందికి 548, నల్లూరులో 432 మందికి 391కి, వడ్లమూరులో 483 మందికి 445, పడమర ఖండ్రికలో 501మందికి 468, కేదారిలంకలో 469 మందికి 437, తాతపూడిలో 336 మందికి 308, కాలేరులో 630 మందికి 604, వెదురుమూడిలో 310 మందికి 286, అద్దంకివారిలంకలో 351 మందికి 336 మందికి పింఛన్లు అందజేశారు.

మండపేట: పట్టణంలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ బి.రాముతో కలసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొందరు వికలాంగులకు రూ.15 వేల పింఛన్లను ఎమ్మెల్యే అందించారు. ఎక్కడా పింఛన్ల పంపిణీ ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు అధికారులు, పార్టీ నాయకులకు ఫోన్లో దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని వంద శాతం పూర్తి చేసేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేస్తున్నారని కోరారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న పామర్రు రాజు కాలువ

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో కాజులూరు మండల గ్రామాల్లో శనివారం జోరువాన కురిసింది. తెల్లవారుజాము నుంచి బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు బయటకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. వాయుగుండం తీవ్రతను గుర్తించి కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలకు సెలవులు ప్రకటించటంతో పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోని వీధుల్లో వర్షపు నీరు చేరి జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయి రోడ్డు మునిగిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొలాల్లోనూ వరదనీరు భారీగా వచ్చి చేరింది. నాట్లువేసి ఇప్పుడిప్పుడే దుబ్బు కడుతున్న పొలాలు నీటమునిగి ఉండటంతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. కోస్తాతీరం వెంబడి మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు చెబుతుండటంతో రైతులు మరింత ఆందోళనలకు గురవుతున్నారు. తొలకరి తొలిదశలో భారీ వర్షాలు కురవటంతో డ్రెయిన్ల వెంబడి ఉన్న పల్లపు పొలాల్లో ముంపుతీవ్రత ఎక్కువగా ఉంది.

జన జీవనం అస్తవ్యస్తం

కె.గంగవరం: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వర్షాల జోరు

- గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం
- నీటమునుగుతున్న పల్లపు పొలాలు
- రైతుల ఆందోళన

శుక్రవారం తెల్లవారు జాము నుంచి చినుకుచినుకుగా కురిసిన వర్షం సాయంత్రానికి జోరందుకుంది. వర్షం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లప్రాంతాలు నీటి మునిగాయి. కె.గంగవరం మండలంలోని ప్రధాన కాలువలు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షం పడడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ప్రధాన కాలువలు, చెరువులు వర్షపు నీరుతో కళకళలాడుతున్నాయి. యండగండిలోని టేకి డ్రెయిన్‌లో భారీగా గుర్రపుడెక్క కొట్టుకురావడంతో వర్షపు నీరు ముందుకు కదలడం లేదు. ఈ గుర్రపుడెక్కను తొలగించకపోతే పొలాల్లో ఉన్న వర్షపు నీరు బయటకి వెళ్లే దారి లేక ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

కపిలేశ్వరం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో శనివారం వర్షం జన జీవనాన్ని స్తంభింపజేసింది. ఎడతెరపి లేకుండా కురుస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అంగర మార్కెట్‌ను వర్షపు నీరు ముంచెత్తింది. శ్రీరాంనగర్, రాజీవ్ కాలనీ, చేనేత సహకార సంఘం పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ వర్షం తీవ్రత తగ్గడంతో నీరు వీధులను వీడింది. అంగర, పడమర ఖండ్రిక, టేకి, వల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వెదురుమూడి, కేదారిలంక, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి.


అంగర మార్కెట్ వద్ద వర్షపు నీరు


ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో నీట మునిగిన వరిపొలాలు

క్లుప్తంగా

భీమేశ్వరాలయ ఈఓగా 'అల్లు'


అల్లు వెంకట దుర్గాభవాని

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ఈఓగా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఉత్తర్వుల మేరకు పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనపు బాధ్యతగా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో విధుల్లో చేరారు. ఆలయ సిబ్బంది ఆమెకు గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.

భగవతి లీల సేవలు ఆదర్శనీయం


ఉద్యోగ విరమణ చేసిన భగవతి లీల దంపతులను సన్మానించిన వైద్య సిబ్బంది

కె.గంగవరం: విధి నిర్వహణలో కూడెల్లి భగవతి లీల సేవలు పలువురి ఉద్యోగులకు ఆదర్శనీయమని పామర్రు పీహెచ్‌సీ వైద్యులు పోలిశెట్టి హర్షిత, పసుపులేటి విష్ణువర్ధన్ అన్నారు. మండలంలోని పామర్రు పీహెచ్‌సీలో పబ్లిక్ హెల్త్ నర్స్(పీహెచ్‌ఎన్)గా విధులు నిర్వహిస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన కూడెల్లి భగవతి లీలకు పీహెచ్‌సీ ఆవరణలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవతిని ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహించాలన్నారు. రోగులకు సేవలందించడంలో ఆమె చూపిన కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం పూలదండలు, శాలువాలతో కూడెల్లి భగవతిలీలతో పాటు ఆమె భర్త మోటుపల్లి సుధాకరరావు దంపతులను వైద్య సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

నేటి కాపు ప్రజాప్రతినిధుల సన్మానసభ వాయిదా

మండపేట: పట్టణంలో ఆదివారం నిర్వహించాల్సిన కాపు ప్రజాప్రతినిధుల అభినందన సన్మాన సభ వాయిదా వేసినట్టు ఏపీ ఐక్య కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు వాదా ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుపానును దృష్టిలో పెట్టుకుని సభను వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత తెలియజేస్తామని చెప్పారు.

2న జమాత్ ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షుడు మండపేట రాక

మండపేట: జమాతె ఇస్లామీ హింద్ సేవాసంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సలీమ్ ఇంజినీర్ సెప్టెంబర్ 2న మండపేట రానున్నట్టు ఆ సంస్థ మండపేట శాఖ అధ్యక్షుడు అబుల్ అలా శనివారం తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ కూడా రానున్నట్టు చెప్పారు. పట్టణంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో వారిద్దరూ పాల్గొంటారని, కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న జమాతె శ్రేణులు అంతా హాజరు కావాలని కోరారు.

2న బీజేపీ సభ్యత్వ నమోదు

మండపేట: సెప్టెంబర్ 2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తెలిపారు. సోమారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 5 వరకూ సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. బూత్ స్థాయిలో కనీసం 25 సభ్యత్వాల వరకూ నమోదు చేయించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 అనే నంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చి ఫొటోతో సహా నరేంద్ర మోడీ యాప్‌లో నమోదు చెయ్యాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

కాజులూరు: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. శనివారం దుగ్గుదుర్రులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో అభివృద్ధిలో ఉన్నాయన్నారు. సెప్టెంబర్ రెండో తేదీ సాయంత్రం ఆరు గంటలకు ప్రధాని నరేంద్రమోదీ పార్టీ తొలి సభ్యత్వం తీసుకుని సభ్యత్వాల నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నారని కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని అవకాశంగా తీసుకుని నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో సభ్యత్వాల నమోదు చేయించి పార్టీ బలోపేతానికి పాటు పడాలన్నారు. నియోజకవర్గంలో 48 వేల సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండల గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేవీ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు, మానసిక వికాసంతో పాటు చదువుల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వివిధ ఆటలు పోటీలు ఈనెల 27 నుంచి కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు.

బదిలీపై వెళ్తున్న కమిషనర్ రాముకు సత్కారం


కమిషనర్‌ను సత్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు

మండపేట: మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన బొడ్డేపల్లి రాము బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కౌన్సిల్ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆధ్వర్యంలో ఆమె చాంబర్లో పూలమాలలు, దుశ్శాలువాలతో రామును సత్కరించి వీడ్కోలు పలికారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలో 7 నెలల పాటు పనిచేసిన కమిషనర్ రాము ఉత్తమ సేవలు అందించారంటూ కొనియాడారు. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ , కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, శెకల్యాణి, నాయుడు లక్ష్మీ సౌజన్య, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గమ్మ, మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైనతేయ తీరంలో గరుత్మంతుడి విగ్రహం


అప్పనపల్లిలో దాత కుటుంబ సభ్యులు ఆవిష్కరించిన గరుత్మంతుడి విగ్రహం

మామిడికుదురు: ప్రముఖ పుణ్యక్షేత్రం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి స్నానఘట్టం వద్ద దాతల విరాళం రూ.రెండు లక్షలతో నిర్మించిన గరుత్మంతుడి విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఐ.పోలవరం మండలం మురముళ్లకు చెందిన దాత చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యుల విరాళం రూ.2 లక్షలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాత కుటుంబ సభ్యులతో విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ సేవలు ఎనలేనివి

ఆలమూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సుదీర్ఘకాలం పనిచేసి పేద ప్రజలకు సేవలందిస్తూ పదవీ విరమణ చేయబోతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) పి.రాధాకృష్ణ సేవలు ఎనలేనివని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ అన్నారు. మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేయబోతున్న సీహెచ్‌ఓ రాధాకృష్ణకు శనివారం సత్కార సభ జరిగింది. జిల్లాలోని అనేక పీహెచ్‌సీల్లో వివిధ హోదాల్లో 43 ఏళ్ల పాటు పనిచేసిన రాధాకృష్ణ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం రాధాకృష్ణ, సాయిలక్ష్మి దంపతులకు స్థానిక పీహెచ్‌సీ అధికారులు, ఆరోగ్య ఆశ సిబ్బంది పూలమాలలు వేసి దుశ్శాలువా వేసి మెమెంటోతో సత్కరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి పాల్గొన్నారు.


మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించే కార్యక్రమం చేపట్టారన్నారు. ఇదే కార్యక్రమంలో ముచ్చెరువుకు చెందిన వాసంశెట్టి సత్యవేణి భర్త భాస్కరరావు ఇటీవల మరణించడంతో ఆమెకు రూ.25 వేలు వ్యక్తిగత సహాయాన్ని మంత్రి సుభాష్ అందజేశారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠలో గొల్లపల్లి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శనివారం నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ కార్యక్రమంలో రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ఆలయంలో స్వామికి ఆయన పూజలు నిర్వహించారు. నాయకులు చల్లా నాగరాజు, కొల్లాబత్తుల కుమార్, యల్లమిల్లి కిషోర్, తాడి సహదేవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.